క్లుప్తంగా

బ్రహ్మోత్సవాలకు రండి


ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను ఇస్తున్న నిర్వాహకులు

కొడంగల్ : పట్టణంలో నిర్వహించనున్న పద్మావతీ సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని మంగళవారం ఆహ్వానించారు. ఆలయ ధర్మకర్తల్లో ఒకరైన నందారం రత్నం, భక్తులు నర్సింహ్మారెడ్డి, బాలప్రకాశ్‌లు ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని అందజేశారు. ఏప్రిల్ 2నుంచి ప్రారంభమై.. 12వ వరకు కొనసాగుతాయన్నారు.

పేదోడి ఫ్రిజ్‌కు భళే గిరాకీ


కుండలను కొనుగోలు చేస్తున్న ప్రజలు

అనంతగిరి: ఎండలు మండుతున్నాయి. దీంతో ప్రజలు చల్లని నీళ్లు తాగేందుకు ఆసక్తి చూపుతున్నారు. కాగా, కోవిడ్ తర్వాత ఫ్రిజ్‌ల్లో వాటర్ తాగడం చాలా మంది మానేశారు. చల్లని నీళ్లు తాగాలనుకునే వారు కుండల్లోని చల్లని నీరు తాగుతున్నారు. వీరితో పాటు ఫ్రిజ్‌లు, వాటర్ కూలర్లు కొనుగోలు చేయలేని పేద, మధ్య తరగతి ప్రజలు సైతం కుండలనే కొనుగోలు చేస్తున్నారు. దీంతో కుండలను మార్కెట్‌లో ప్రజలకు నచ్చిన డిజైన్‌ల్లో తయారు చేసి విక్రయిస్తున్నారు. మట్టి కుండలకు నల్లా ఫిట్ చేసి ఉన్నాయి. మరి కొన్ని నేరుగా కుండలు, చిన్న చిన్న మట్టి సీసాలను సైతం విక్రయిస్తున్నారు. ప్రజలు ఆరోగ్యానికి మేలైన కుండలను కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ఆదమరిస్తే అంతే..


రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలోని ప్రధాన రోడ్డు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద మురుగు కాల్వ మధ్య ఓ గుంత ఏర్పడింది.ఈ గుంత ప్రమాదకరంగా మారింది. అటు పక్కనే ఓ స్కూల్ ఉండటంతో పాటు, ప్రభుత్వ ఆస్పత్రికి కూడా ప్రజలు వెళ్తుంటారు. దీంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

తహసీల్దార్ కార్యాలయం సందర్శన


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న ఆర్డీఓ

అనంతగిరి: ఇటీవల ఆర్డీఓగా బాధ్యతలు తీసుకున్న వసుచంద్ర మంగళవారం వికారాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ లక్ష్మీనారాయణతో పలు విషయాలపై చర్చించారు. అనంతరం ఎస్ఎస్‌సీ పరీక్షల నేపథ్యంలో పట్టణంలోని జిరాక్స్ సెంటర్లను ఆయన పరిశీలించారు.

మల్లు స్వరాజ్యంకు ఘన నివాళి


స్వరాజ్యం వర్ధంతి వేడుకలో సీపీఎం నాయకులు

పరిగి: భూమి కోసం భుక్తి కోసం పోరాటం చేసిన సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం రెండో వర్ధంతిని మంగళవానం సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య మాట్లాడుతూ.. నీ బాంచన్ దొరా, నీ కాల్మొక్త అనే బడుగు బలహీనుల చేత బందూకులెత్తించిన వీప్లవ వీరనారి మల్లు స్వరాజ్యమన్నారు. దొరల నుంచి భూస్వాముల నుంచి రైతాంగ సాయుధ పోరాటం ద్వారా వేల ఎకరాలను పేదలకు పంచిన ఆమె సేవలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరవలేరన్నారు. కార్యక్రమంలో నాయకులు హబీబ్,సత్తయ్య, రఘురాం, కృష్ణ పాల్గొన్నారు.

పశువుల దాహార్తి తీరేనా?

ఎండలు మండుతున్నాయి. పశుపక్షాదులు గుక్కెడు నీటికి అల్లాడుతున్నాయి. దాహం తీరే దారి లేక విలవిలలాడుతున్నాయి. రానున్న రోజుల్లో ఎండలు మరింతగా ముదిరే అవకాశం ఉంది. శిథిలావ్యవస్థకు చేరిన నీటి తొట్టెలకు మరమ్మతులు చేయించి, నీటి నింపి మూగజీవాల దాహార్తి తీర్చాలని ఆయా గ్రామాల రైతులు వేడుకుంటున్నారు.

- నిరుపయోగంగా మారిన పశువుల నీటి తొట్టెలు
- దాహార్తి తీర్చుకునేందుకు అల్లాడుతున్న మూగజీవాలు
- ఆందోళన చెందుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు


మోత్కూర్ గ్రామంలో నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టి

దోమ : వేసవిలో మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ప్రభుత్వం లక్షల రూపాయాల నిధులను వెచ్చించి గత ప్రభుత్వాలు నీటి తొట్టెలు నిర్మించాయి. అయితే అధికారుల వారి పర్యావేక్షణ పట్టించుకోక పోవడంతో శిథిలావ్యస్థకు చేరి నిరుపయోగం మారాయి. దీంతో మూగ జీవాలు దాహం తీర్చుకునేందుకు అల్లాడుతున్నాయని రైతులు వాపోతున్నారు.

జిల్లాలో 617 తొట్లు..

జిల్లా వ్యాప్తంగా 19 మండలాలు ఉండగా ఐదేళ్ల క్రితం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ కింద అవసరమైన గ్రామాలకు 617 నీటి తొట్టెలను నిర్మించారు. అయితే, ఆయా గ్రామాల్లో కొన్ని తొట్లు పగుళ్లు రావడం, పలు చోట్ల ఇప్పటికీ నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఉపయోగంలోకి రాలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. వాటిపై దృష్టా సారించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నారు. నిర్మించిన వాటిలోనైనా నీటిని నింపాలన్న ఆలోచన అధికారులకు రాకపోవడం దారుణమని ఆయా గ్రామాల రైతులు ఆరోపిస్తున్నారు.

శిథిలావ్యస్థకు చేరాయి..

దోమ మండల వ్యాప్తంగా 36 గ్రామ పంచాయతీలు ఉన్నాయి., 11,850 ఎద్దులు, 8,964 ఆవులు, 24,312 మేకలు 14,163 గొర్రెలు ఉన్నాయి. వీటి దాహార్తి తీర్చేందుకు మండలంలో 60 తొట్లను నిర్మించారిని పశువైద్యాధికారి తెలిపారు. వాటిలో కొన్ని శిథిలావ్యస్థకు చేరి కూలిపోయాయి. నీటి తొట్లలో గ్రామ పంచాయతీల బోర్ల ద్వారా నీరును సరఫరా చేయాల్సి ఉండగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పాలకవర్గం పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో పలు చోట్ల నీటి తొట్ల వద్దకు వచ్చిన పశువులు, మేకలు, గొర్రెలు నీళ్ల లేకపోవడంతో ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నాయి.


పాలేపల్లిలో చెత్త చెదారంతో నిండిపోయిన తొట్టి

గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో సైతం నీరు అడుగంటుతుండడంతో మూగజీవాలు విలవిలలాడుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తొట్లను బాగు చేయించి, నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

తొట్లలో నీరు నింపాలి



వేసవి దృష్ట్యా పశువుల కోసం గ్రామాల్లో నిర్మించిన నీటి తొట్లలను అధికారులు బాగు చేయించి నీరును నింపేలా కృషి చేయాలి. ఎండలు మండుతున్న నేపథ్యంలో మూగజీవాలకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. చాలా గ్రామాల్లో నీటి తొట్టెలు అందుబాటులో లేక మూగజీవాలను చెరువుల దగ్గరకు తీసుకెళ్లి నీటిని తాగిస్తున్నారు.

–రాములు, ఎంపీటీసీ బొంపల్లి

పట్టించుకోవడం లేదు



పశువుల దాహార్తిని తీర్చిందుకు గత ప్రభుత్వాలు నీటి తొట్లు నిర్మించగా వాటికి కనీస మరమ్మతులు చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారు. పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు వేసవిని దృష్టిలో పెట్టుకొని నీరు నింపేలా చర్యలు తీసుకోవాలి.

–గోవర్ధన్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు, దోమ

పశువుల దాహార్తి తీరుస్తాం



గ్రామాల్లో ఉన్న పశువుల దాహార్తి తీర్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. శిథిలావ్యస్థకు చేరిన తొట్లను స్పెషల్ ఆఫీసర్లతో బాగు చేయించి నీటి నింపి అందుబాటులోకి తీసుకువస్తాం. పలు చోట్ల ఇప్పటికే నీరు నింపాం. మిగతా చోట్ల కూడా నింపేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఆనంద్, పశువైద్యాధికారి, దోమ

పత్తి దిగుబడి పెరగాలి

ఏఆర్‌సీ శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్


రైతుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

యాలాల: రైతులు పత్తి దిగుబడిని పెంచాల్సిన ఆవశ్యకత ఉందని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం(ఏఆర్‌సీ) శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్ అభిప్రాయపడ్డారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాటన్ రిసెర్చ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. పత్తి సాగుకు తేలికపాటి నేలలు అవసరమన్నారు. పత్తి సాగులో అధిక సాంద్రత, విత్తనం విత్తే విధానం, మొక్కల దూరం విషయంలో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఏరువాక కేంద్రం, ఏఆర్‌సీ శాస్త్రవేత్తలు సుధారాణి, రాజేశ్వర్‌రెడ్డి, యమునా తదితరులు మాట్లాడుతూ.. అధిక సాంద్రత పత్తిలో ఆశించే తెగుళ్ల, వేరుకుళ్లతెగులు, ఎండుతెగులు, తలమాడు తెగులు లక్షణాలు, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి యాదగిరి, ఏఈఓలు తదితరులు ఉన్నారు.

సలామ్ డాక్టర్ సాబ్

ఉదారత చాటిన వైద్యుడు సంపత్‌కుమార్


రక్తదానం చేస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్

తాండూరు: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యుడు సంపత్‌కుమార్ ఉదారత చాటారు. కోలోరిక్టల్ వ్యాధితో బాధపడుతున్న రోగి వెంకటయ్యకు అత్యవసరంగా సర్జరీ చేయాలి. అయితే, రోగి రక్తహీనత కారణంగా సర్జరీ నిలిచిపోయింది. ఏ నెగిటివ్ బ్లడ్ గ్రూపు ఎక్కడ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల రక్తం కోసం ప్రయత్నించారు. అయినా ఫలితం లేదు. ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న బాలాజీ హాస్పిటల్ యజమాని డాక్టర్ సంపత్‌కుమార్ ఆయుష్ బ్లడ్ బ్యాంక్‌లో మంగళవారం రక్తదానం చేసి సర్జరీ జరిగేలా చూశారు. ఏ నెగిటివ్ బ్లడ్ గ్రూపు అతి తక్కువ మందిలో ఉండే రక్తం. డాక్టర్ సంపత్‌కుమార్ మూడు దశాబ్దాలుగా పలుమార్లు రక్తదానం చేశారు. గతేడాది అక్టోబర్ 18వ తేదీన ఓ గర్భిణి రక్తహీనతతో బాధపడుతోందని తెలుసుకొని రక్తదానం చేశారు. ప్రస్తుతం మరోసారి రక్తదానం చేసి అందరి మన్ననలు పొందారు.

చదువుల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్

టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం


గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం తదితరులు

షాద్‌నగర్: విద్యార్థులు చదువుల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్ ఉంటుందని రాయికల్ టోల్‌ప్లాజా మేనేజర్ ఇబ్రహీం అన్నారు. మండలంలోని రాయికల్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసడక్, జడ్చర్ల ఎక్స్‌ప్రెస్ వే వారి ఆధ్వర్యంలో రూ.9.85లక్షలతో ఏర్పాటు చేసిన నూతన గ్రంథాలయాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇబ్రహీం మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు తమవంతు సేవ చేయాలనే లక్ష్యంతో సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలలో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది విశ్వనాథ్ రాజు, బిజోయ్ బాబు, జగదీశ్, నరేశ్‌కుమార్, పాఠశాల హెచ్‌ఎం జయమ్మ, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం’

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల గడ్డపై బీఆర్‌ఎస్ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని టీఎల్‌ఎఫ్ రాష్ట్ర బీఆర్‌ఎస్ నాయకుడు పీసరి సతీశ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేవెళ్ల బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను భారీ మోజార్టీతో గెలిపిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అందరికీ అన్నీ ఇస్తామని, ఇప్పుడు మాత్రం కొందరికే ఇస్తామంటుందని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటికీ వాటి ఊసే లేదన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు.

నూతన నియామకం

పరిగి: వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడిగా చంద్రయ్యను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు సుధీర్ చేతుల మీదుగా నూతన అధ్యక్షుడికి నియమక పత్రం అందజేశారు. అనంతరం చంద్రయ్య మాట్లాడుతూ.. వికలాంగుల హక్కుల సాధన కోసం కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందేలా చూస్తానన్నారు. గ్రామ గ్రామాన వికలాంగులను ఏకం చేసి ఐక్యంగా ఉండి సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అప్రమత్తత తప్పనిసరి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి


వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

కేశంపేట: వైద్య సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, రోగులకు సకాలంలో సేవలు అందించాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని పరిశీలించిన అనంతరం ఆమె వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వ్యాక్సినేషన్‌తో పాటు రోగులకు మందులను సక్రమంగా అందించాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, హెచ్ఈ శ్రీనివాస్‌లు, హెచ్ఈఓ ఆంజనేయులు, ఉపేందర్‌రెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

చేనేత, హస్తకళలను ఆదరించాలి


బట్టలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు టౌన్ : చేనేత, హస్తకళలను ప్రతి ఒక్కరూ ఆదరించాలని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి సూచించారు. మంగళవారం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేత, హస్తకళా ప్రదర్శనను పట్టణ మున్సిపల్ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్నతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. ఎలాంటి యంత్రాలను ఉపయోగించకుండా చేతితో చేసిన వస్తువులు ఎంతో విలువైనవని అన్నారు. చేనేత, హస్తకళలు దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయన్నారు. దేశంలోని నలుమూలల, పలు రాష్ట్రాల నుంచి చేనేత, హస్తకళ కళాకారులు తయారు చేసిన వస్తువులను విక్రయించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నీరజాబాల్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, రవి, రాము, నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, అనిల్, రాములు, సంతోష్, వేణుగోపాల్, వీరేందర్, మురళీకృష్ణ, భాను పాల్గొన్నారు.

వైశ్య ఫెడరేషన్ సేవలు అభినందనీయం

తాండూరు టౌన్ : ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన పట్టణంలోని గాంధీచౌక్, భద్రప్ప చౌక్‌ల్లో ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్నతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వేసవికాలంలో పట్టణానికి గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రజలు వస్తుంటారని, వారి దాహార్తిని తీర్చేలా స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలను ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. వ్యాపార రంగంలో ఉన్న ఆర్యవైశ్యులు తమ వంతు సాయంగా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఫెడరేషన్ సభ్యులు రొంపల్లి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. గత ఐదేళ్లగా తమ సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రాలను, అంబలి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భవిష్యత్‌లో కూడా సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ నీరజాబాల్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు హబీబ్ లాలా, శేషు, మహేశ్, జగదీశ్వర్, ప్రణయ్, సాయితేజ పాల్గొన్నారు.

యాదవులతో కురుమను కలపొద్దు

తాండూరు టౌన్ : యాదవులతో కురుమలను కలపొద్దని కురుమల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి మంగళవారం కురుమ సంఘం సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనాభాలో 40 శాతం కురుమ కులస్తులం ఉన్నామన్నారు. ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా అన్ని రంగాల్లో కురుమలు వెనుకబడి ఉన్నారని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం వల్ల అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వం యాదవులతో కలిపి కార్పొరేషన్ ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో నాగారం జగదీశ్, పాండు, నర్సింహులు, వెంకటయ్య, శ్రీశైలం, మహేశ్, శ్రీనివాస్, మాణిక్‌రావు, మల్లేష్, కిష్టప్ప తదితరులు ఉన్నారు.

పెళ్లికి సిద్ధమైన లక్ష్మీనారసింహుడు


వెల్‌చాల్ నరసింహ్మస్వామి ఆలయం


లక్ష్మీనరసింహ్మస్వామి మూలవిరాట్


పరమదాసు చెక్కిన గుహ

నేటి నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవం

మోమిన్‌పేట: మండలంలోని వెల్‌చాల్ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహ్మస్వామి జాతర మహోత్సవాలు నేడు, రేపు నిర్వహించేందుకు స్వామివారి నిముస్తాబు చేస్తున్నారు. 20న స్వామివారి రథోత్సవం, 21న స్వామివారి కల్యాణోత్సవం, మ ధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, పెరుగు వసంతం నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

పులిలోంక... పుణ్యక్షేత్రమైంది..

ఒక్కప్పుడు పులులు సంచరించే దట్టమైన అడవి.. ప్రస్తుతం లక్ష్మీనరసింహ్మస్వామి దేవాలయంతో పుణ్యక్షేత్రమైంది. కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహా రుషులవుతారు.. అన్నా నానుడి నిజం చేశాడు ఓ మేకల కాపరి. 56 సంవత్సరాల క్రితం అడవికి వేళ్లాలంటే అందరికి భయం వేసేది. మేకల కాపరిగా వేళ్తూ కొన్ని సంవత్సరాలు ఓంటరిగా సుమారు 20 మీటర్ల పొడవు, నాల్గు మీటర్ల వెడల్పుతో పెద్ద గుహను తొలిచి లక్ష్మీనరసింహ్మ స్వామి విగ్రహాలను ప్రతిష్టించాడు. అప్పటి నుంచి పులి లోంక... పుణ్యక్షేత్రమైంది. ఆ మేకల కాపరి పర్మయ్య పరమదాసుగా మారాడు. చూట్టు ఎతైనా గుట్టలు.. దట్టమైన అడవి.. ఆహ్లాదమైన ప్రదేశం... పచ్చని చెట్లు .. చల్లని గాలులతో భక్తులను ఇక్కడి ప్రదేశం ఆకట్టుకుంటుంది.

దినదినాభివృద్ధి..

లక్ష్మీనరసింహ్మస్వామిని దర్శించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా వస్తుంటారు. భక్తులు ఇచ్చే విరాళాలతో దేవాలయాన్ని పరమదాసు అభివృద్ధి చేశాడు. భక్తులకు మంచి నీటి సౌకర్యం కల్పించడానికి కొలను నిర్మించారు. ప్రతి సంవత్సరం పాల్గున శుద్ధ నవమి నుంచి ఐదు రోజుల బ్రహ్మోత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తారు.

అలయ ప్రాంగణంలో...

అలయ ప్రాంగణంలో ఆంజనేయస్వామి దేవాలయం, శివాలయం, గుహలో వేంకటేశ్వర స్వామి విగ్రహాలను ప్రతిష్టించారు. సంతానం లేని జంటలు టెంకాయలు తీసుకుని మొక్కి అక్కడ ఉన్న మేడి చెట్టుకు కట్టితే ఎడాది తిరిగేలోపు సంతానం కల్గుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

గుహనే ప్రత్యేక ఆకర్షణ

దైవ సంకల్పంతోనే ఈ మహాత్కర పనిని పూనుకున్నానని పరమదాసు పేర్కొంటాడు. ఒక మనిషి ఒంటరిగా 20 మీటర్ల పొడవు, నాల్గు మీటర్ల వెడల్పుతో గుట్టను గుహగా.. గుడిగా మలిచి అందులో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని ప్రతిష్టించడంతో భక్తులకు గుహ ప్రత్యేక ఆకర్షణగా మిగిలింది.

ఇలా చేరుకోవచ్చు..

మోమిన్‌పేట మండల కేంద్రానికి 9 కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. వికారాబాద్ నుంచి సదాశివపేట, సదాశివపేట నుంచి వికారాబాద్ వేళ్లే మార్గంలో వెల్‌చాల్ బస్టాండు వద్ద బస్సు దిగి అక్కడి నుంచి 2 కిలోమీటర్లు ఆటోలపై వెళ్లాలి. ప్రతి 20 నిమిషాలకు ఓ బస్సు ఉంది. వికారాబాద్, జహిరాబాద్‌ల నుంచి నుంచి రైలు సౌకర్యం కలదు. వెల్‌చాల్ సమీపంలో సదాశివపేట రోడ్డు స్టేషన్‌లో దిగి ఆటోలో వేళ్లావచ్చు.

చేవెళ్ల పార్లమెంట్‌ను గెలిపించుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు వెంకటయ్య

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, సీనియర్ నాయకుడు వెంకటయ్య

దోమ : పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ప్రతి బీజేపీ కార్యకర్త సమన్వయంతో పని చేస్తూ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిని గెలిపించుకునేందుకు కృషి చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవులు, సీనియర్ నాయకులు ఘనపురం వెంకటయ్య పిలుపునిచ్చారు. మంగళవారం దోమ మండల పరిధిలోని మైలారంలో దోమ, కుల్కచర్ల మండలాల కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ మళ్లీ ప్రధాని కావాలంటే ప్రతి కార్యకర్త సమష్టిగా పని చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటును అభ్యర్థించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అవలంబించిన ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. కార్యకర్తలు ఎలాంటి ఒత్తిడికి గురికావొద్దన్నారు. ప్రతి కార్యకర్తకు పార్టీ సముచిత స్థానం కల్పిస్తుందని, బాధ్యతతో అభ్యర్థికి గెలిపించుకునేలా శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యులు హరికృష్ణ, బీజేపీ మండలాల మాజీ అధ్యక్షుడు రాంరెడ్డి, మహిపాల్, ఆంజనేయులు, నాయకులు మల్లేశ్, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, హన్మంతు, కేశవులు, ఆంజనేయులు, బీరప్ప, మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.